క్లుప్తంగా

వేసవి మధ్యాహ్నం వేళ మంటలు



ఏటిగట్టుపై మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తాళ్లపూడి: ఎవరో ఆకతాయిలు చేసిన పని వల్ల వేగేశ్వరపురంలో అగ్నిప్రమాదం సంభవించింది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ గ్రామంలోని ఏటిగట్టును ఆనుకుని కొందరు యానాదులు తాటాకు పాకలు వేసుకుని నివాసం ఉంటున్నారు. వారు తమ వ్యర్థాలను ఆ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో వేస్తుంటారు. మంగళవారం మిట్ట మధ్యాహ్నం ఎండ మండిపోతున్న వేళ ఎలా రాజుకుందో గాని అక్కడి ఖాళీ స్థలంలో నిప్పంటుకుని మంటలు ఎగిసి పడ్డాయి. ఏటిగట్టుపై ఉన్న చెట్ల పొదలు కూడా అంటుకున్నాయి. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు కమ్మేసింది. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్ కొవ్వూరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వెంటనే ఘటనా స్థలానికి వచ్చి మంటలు విస్తరించకుండా సకాలంలో అదుపు చేశారు. ఏ మాత్రం ఆలస్యమైనా మంటలు పక్కనే ఉన్న పూరిపాకలు, కరెంట్ వైర్లకు చేరి పెను ప్రమాదం సంభవించేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

10 మంది వలంటీర్ల రాజీనామా

చాగల్లు: మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలో పని చేస్తున్న 10 మంది వలంటీర్లు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్టు ఎంపీడీఓ ఎస్.బుజ్జి మంగళవారం తెలిపారు. చాగల్లు–3 సచివాలయ పరిధిలోని కోసూరి శిరీషారాణి, బొల్లిపో రమేష్, బొల్లిపో భాగ్యలక్ష్మి, నెలటూరులో ఆరుగురు, ఎస్.ముప్పవరంలో ఒక వలంటీర్ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ బుజ్జికి అందజేశారు.

ముగిసిన మేరీమాత ఉత్సవాలు



వేగేశ్వరపురం మేరీమాత ఉత్సవాల్లో ప్రసంగిస్తున్న ఫాదర్ జాన్

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని నిత్య సహాయ గోదావరి మేరీమాత పుణ్యక్షేత్ర మహోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ టి.జాన్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి పరిశుద్ధ జపమాల, దివ్య బలిపూజ, సువార్త స్వస్థత ప్రార్థనలు జరిగాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం సమష్టి దివ్యబలి పూజలో పలువురు ఫాదర్లు పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. మేరీమాత గాయక బృందం ఆధ్వర్యంలో ప్రార్థన గీతాలు ఆలపించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మేరీమాతకు కానుకలు సమర్పించారు. మరియ తల్లి స్వరూపాల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు.

నేడు చాగల్లు మండలంలో 'తలారి' ప్రచారం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు బుధవారం ఉదయం ఏడు గంటల నుంచి చాగల్లు, మీనానగరం, నెలటూరు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారు. ప్రచార రథం ముందు భాగంలో పార్టీ శ్రేణులంతా మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహిస్తాయి. అలాగే బుధవారం సాయంత్రం మూడు గంటల నుంచి నందిగంపాడు, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, ఎస్.ముప్పవరం, గరప్పాడు గ్రామాల్లో నిర్వహించే ప్రచారంలో పాల్గొంటారు. కావున నియోజకవర్గంలోని పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమానికి తరలి రావాలని తలారి కోరారు.

మండల సమావేశంలో పలు అంశాలపై చర్చ

పెరవలి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. నాలుగో విడత డ్వాక్రా రుణమాఫీ సొమ్ములు కొన్ని గ్రూపుల వారికి ఇంతవరకూ జమ కాలేదని కొందరు సభ్యులు సమావేశంలో ప్రస్తావించారు. దీనిపై ఏపీఎం నాగరాజు బదులిస్తూ మండలంలో 1541 గ్రూలులు ఉండగా వాటిలో 991 గ్రూపులకు సొమ్ములు జమ అయ్యాయన్నారు. మిగిలిన 550 గ్రూపులకు నిధులు విడుదల కావలసి ఉందన్నారు. సమావేశంలో ఏవో మేరీ కిరణ్ మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లను ముమ్మరంగా చేస్తున్నామన్నారు. ఈ దశలో కానూరు అగ్రహారం ఎంపీటీసీ సభ్యుడు హరిదాసు సుబ్బారావు కలగజేసుకుని కొనుగోలు కేంద్రాలను ఉదయం 10 గంటలైనా తెరవడం లేదన్నారు. దీంతో రైతులు ఇబ్బందులు పడవలసి వస్తోందన్నారు. ఎంపీడీఓ కె హిమ మహేశ్వరి, కార్యాలయ సూపరింటెండెంట్ రమేష్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం.. జగన్‌తో సాధ్యం

- ప్రజల చెంతకే పాలన
- సచివాలయ వ్యవస్థతో విప్లవాత్మక మార్పులు
- నియోజకవర్గంలో 62 ఏర్పాటు
- రూ.20.80 కోట్లతో శాశ్వత భవనాల నిర్మాణం
- నియోజకవర్గంలో 500 మందికి ఉద్యోగాలు



చాగల్లు మండలం చిక్కాల గ్రామ సచివాలయ భవనం



తాళ్లపూడి మండలం పోచవరం గ్రామ సచివాలయ భవనం

కొవ్వూరు: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారు. దేశంలోని మరే రాష్ట్రంలోనూ లేనివిధంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయం చొప్పున నిర్మించారు. అవినీతికి తావు లేకుండా కులమత వర్గ,పార్టీ బేధాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిచేందుకు చర్యలు తీసుకున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా వేలాది స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారు. గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు సంక్షేమ పథకాలు చేరవేసేందుకు వీలుగా సచివాలయాలకు అనుసంధానంగా వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారు. ప్రతినెలా ఒకటో తేదీనే పింఛనుదారుల ఇంటి తలుపు తట్టి పెన్షన్లు అందిస్తున్నారు. గతంలో ఏదైనా ధ్రువీకరణ పత్రం కావాలిస్తే మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడా అవసరం లేకుండా గ్రామ సచివాలయాల ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్నారు. పింఛను, ఆరోగ్య, ఆధార్ కార్డులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో సహా 544 సేవలను నిర్దిష్ట కాల వ్యవధిలో అందుబాటులోకి తెచ్చారు. గతంలో ఇదే పత్రాల కోసం ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లి అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడా కష్టాలకు తెరపడింది. కొవ్వూరు నియోజకవర్గంలో మొత్తం 52 గ్రామ సచివాలయాలున్నాయి. వాటిలో కొవ్వూరు మున్సిపాలిటీ పరిధిలో పది వార్డు సచివాలయాలు పనిచేస్తున్నాయి.

సచివాలయాల ద్వారా 544 సేవలు

సచివాలయంలో 11 శాఖలకు చెందిన 544 సేవలను ప్రజలకు అంది స్తున్నారు. ప్రధానంగా గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసు, అగ్రికల్చర్, ఉద్యానశాఖ, పశు సంవర్ధక శాఖల సహాయకులు, విలేజ్ సర్వేయర్, వీఆర్వోలు, ఎనర్జీ అసిస్టెంట్ (జూనియర్ లైన్‌మన్), ఏఎన్ఎం వంటి పోస్టులు నియమించారు.

కొత్త భవనాల నిర్మాణం

నియోజకవర్గంలో మండలాల వారీగా కొవ్వూరులో 19, చాగల్లులో 18, తాళ్లపూడిలో 15 చొప్పున గ్రామ సచివాలయాల నిర్మాణం చేపట్టారు. ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షల చొప్పున 52 గ్రామ సచివాలయాలకు ప్రభుత్వం రూ.20.80 కోట్లు మంజూరు చేసింది. వాటిలో ఇప్పటికే 26 సచివాలయాల నిర్మాణం పూర్తయ్యింది. మరో 26 సచివాలయాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. వీటికి తోడు పట్టణంలో పది వార్డు సచివాలయాలు నడుస్తున్నాయి. వీటిని వివిధ ప్రభుత్వ, అద్దె భవనాల్లో ఏర్పాటు చేశారు. పట్టణంలో సచివాలయాలకు స్థల సేకరణ చేపట్టాల్సి ఉంది.

వందలాది మందికి ఉద్యోగాలు

ఒక్కో సచివాలయంలో ఎనిమిది నుంచి పది చొప్పున సిబ్బందిని నియమించారు. ఈ లెక్కన నియోజకవర్గంలోని 62 సచివాలయాల ద్వారా సుమారు 500 మంది నిరుద్యోగులకు ఉపాధి లభించింది. సచివాలయ వ్యవస్థకు అనుసంధానంగా ప్రతి 50 గృహాలకు ఒక వలంటీర్ చొప్పున నియమించారు. నియోజకవర్గంలో 991 మంది వలంటీర్లు లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడంలో సహకరిస్తున్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 1,500 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభించాయి.

నియోజకవర్గంలో గ్రామ సచివాలయాల నిర్మాణం

మండలం	మొత్తం సంఖ్య	నిర్మాణం పూర్తయినవి	నిర్మాణంలో ఉన్నవి
కొవ్వూరు	19	08	11
చాగల్లు	18	08	10
తాళ్లపూడి	15	10	05
మొత్తం	52	26	26

వైఎస్సార్ సీపీ తరఫున ఇంటింటి ప్రచారం



పెద్దేవంలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ పోశిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్దేవం, తిరుగుడుమెట్ట , ప్రక్కిలంక గ్రామాల్లో వారు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ నాయకుడు సిర్రా గంగారావు, తిగిరిపల్లి ప్రసాద్, కల్లూరు సుబ్రహ్మణ్యం, సాయన సుబ్బారావు, ఎండపల్లి కృష్ణార్జునుడు, సిర్రా గోపి, కొడమంచిలి విక్టర్ తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. అలాగే ప్రక్కిలంకలో యాళ్ల స్వప్న, యాళ్ల బాబూరావు, తిరుగుడుమెట్టలో వల్లభశెట్టి శ్రీనివాస్, కొఠారు సత్యనారాయణ, అందుగుల రవి తదితరులు ప్రచారం చేశారు.

పేదలకు మేలు చేసేలా జగన్ మేనిఫెస్టో



ఎస్.ముప్పవరం సమావేశంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్. చిత్రంలో తలారి వెంకట్రావు కుమార్తె షాలిని

చాగల్లు: పేదలకు మేలు చేసేలా వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూపొందించారని ఆ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని నందిగంపాడు, కలవలపల్లి, ఎస్.ముప్పవరం గ్రామాల్లో మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెడతామని గూడూరి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకే వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు కుమార్తె షాలిని, సర్పంచులు ముప్పిడి మహాలక్ష్మడు, రాంబాబు, సొసైటీ అధ్యక్షులు గూడపాటి శివ, గూడపాటి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ తదితరులు

- నాలుగో వార్డు నుంచి వంద మంది రాక
- ఆహ్వానించిన ఎమ్మెల్యే అభ్యర్థి వెంకట్రావు, మాజీ ఎమ్మెల్సీ శివరామకృష్ణ

కొవ్వూరు: పట్టణంలోని నాలుగో వార్డు నుంచి సుమారు వంద మంది టీడీపీ కార్యకర్తలు, మహిళలు, యువకులు మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సమక్షంలో మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద వారందరికీ వెంకట్రావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదల బతుకుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని ఆయనన్నారు. మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించుకుంటే అన్ని వర్గాలకూ మేలు చేకూరుతుందన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. మావుడూరి బంగార్రాజు, కొండమహంతి విజయ్ భాస్కరరావు, మావుడూరి పెద్దిరాజు, తమ్మిడి వేణుగోపాల్, కన్నెం మురళి, గుబతాల శాంత, మేకల శ్యామల, కొడమహంతి లత, తరిపే నాగరత్నం తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ వైస్ చైర్ పర్సన్లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, కౌన్సిలర్‌లు కంఠమణి రమేష్‌బాబు, దేవగుప్తాపు చాందిని, మహిళా నాయకురాలు ముంగమూరి నాగమణి, వరిగేటి సుధాకర్, సూర్ల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబువి బూటకపు హామీలు

- కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- పట్టణంలో విస్తృతంగా ప్రచారం



ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ

కొవ్వూరు: ఎన్నికల వేళ చంద్రబాబు ఇస్తున్న బూటకపు హామీలను నమ్మి ఓటర్లు మోసపోవద్దని, విజ్ఞతతో ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో మంగళవారం ప్రజారథం పై విస్తృతంగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. అర్హతనే ప్రమాణికంగా తీసుకుని వివక్ష చూపకుండా సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఇచ్చిన హామీలన్నీ తుచా తప్పకుండా అమలు చేసి చూపించిన జగనన్న మరోసారి ముఖ్యమంత్రిగా గెలవడం ద్వారా రాష్ట్రంలో సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.యువకులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున మోటార్ సైకిళ్లలతో ప్రచారం రథం ముందు ర్యాలీగా సాగారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, వైస్ చైర్ పర్సన్లు మన్నె పద్మ, గండ్రోతు అంజనీదేవి, పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, పార్టీ పట్టణ గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, వీర్ల శ్రీహరి పద్మ, కౌన్సిలర్లు కంఠమణి రమేష్‌బాబు, తోట లక్ష్మీ ప్రసన్న, అంకోలు వెంకటలిల్లీ పద్మలీల, దేవగుప్తాపు చాందిని,పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు సిద్ధన వాసు పాల్గొన్నారు.

మహిళా సాధికారత జగనన్నతో సాధ్యం



ద్వారకాతిరుమల మండలం ఐఎస్ రాఘవాపురంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత

- వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత
- ద్వారకా తిరుమల మండలంలో ఎన్నికల ప్రచారం

దేవరపల్లి: రాష్ట్రంలో మహిళా సాధికారత సాధన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. ద్వారకాతిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురం, రామానుజాపురం, ఎస్.రాఘవాపురం, లక్ష్మీపురం, గౌడుగుపేట, జి.కొత్తపల్లి, కొత్తగూడెం, ఆరమ సింగవరం గ్రామాల్లో మంగళవారం మంత్రి వనిత ఎన్నికల ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో ప్రచార రథంపై నుంచి ఆమె మాట్లాడారు. మహిళా సాధికారత సాధించే దిశగా రాష్ట్రంలోని 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు సీఎం జగనన్న ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుని గత ఐదేళ్లలో పొందిన సంక్షేమ పాలనను మరలా పొందుదామని ఆమె పిలుపు నిచ్చారు. తొలుత ఎస్. జగన్నాథపురంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వనిత పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, ఎంపీపీ బొండాడ మోహినీ, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసుబాబు, సర్పంచులు పసుపులేటి ఏసుబాబు, దాకారపు బంగారమ్మ, చెలికాని ప్రవీణ్, పోల్కంపల్లి అనిల్, చెలికాని సంజయ్, చెలాకాని బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు



పాలంగి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు, ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్

- వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు
- రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరితో కలసి ప్రచారం

ఉండ్రాజవరం: గత ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రతి కుటుంబానికీ ఏదో ఒక సంక్షేమ పథకం అందిందని వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని పాలంగి గ్రామంలో మంగళవారం ఆయన ఆ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభ్యర్థులిద్దరికీ గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబునాయుడు 600 పైబడి హామీలిచ్చి, అధికారంలోకి వచ్చారని, వాటిలో ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయకుండా ప్రజలను మోసగించారన్నారు. అయితే అమలు చేయగలిగిన వాటినే సీఎం జగన్ తన మేనిఫెస్టోలో పేర్కొన్నారన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వాసుపత్రులు, పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించారన్నారు. ప్రచారంలో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి శరత్‌బాబు, సర్పంచ్ బొక్క శ్రీనివాస్, ఏఎంసీ వైస్ చైర్మన్ వేలిచేటి జానకిరామయ్య, పాలంగి సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, బొక్క శివకుమార్, దొడ్డా సూర్య నారాయణ, బస్వా ఏసుబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలి

అభ్యర్థుల సమావేశంలో పరిశీలకుడు కమల్‌కాంత్ సరోఛ్



సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకుడు కమల్‌కాంత్ సరోఛ్, ఆర్వో వెంకటరమణనాయక్

నిడదవోలు: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా పాటించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు కమల్‌కాంత్ సరోఛ్ అన్నారు. స్థానిక ఆర్వో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అభ్యర్థుల సమావేశంలో ఆయన ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. అనుమతులకు లోబడి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అభ్యర్థుల పర్యటనలు ఉండాలన్నారు. నియోజకవర్గ సాధారణ పరిశీలకులు ధవళేశ్వరం కాటన్ గెస్ట్ హౌస్‌లో ఉదయం 9 నుంచి 10 వరకూ మే 12వ తేదీ వరకూ రాజకీయ పార్టీలకు, ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. ఎలాంటి ఫిర్యాదులనైనా నేరుగా లేదా 8977935106 ఫోన్ నంబర్‌కు చేయవచ్చన్నారు. రిటర్నింగ్ అధికారి ఆర్.వెంకటరమణ నాయక్ మాట్లాడుతూ అభ్యర్థుల ప్రచారం, పర్యటనలకు విధిగా అనుమతులు పొందాలన్నారు. రానున్న 12 రోజుల కార్యక్రమాలను అభ్యర్థులకు ముందుగా తెలియజేస్తామన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకుడు రోహిత్‌నగర్ మాట్లాడుతూ అభ్యర్థులకు నిర్దేశించిన విధంగా ఖర్చులు రూ.40 లక్షలకు మించకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ వి. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

తండ్రుల తరఫున వారసుల ప్రచారం



నిడదవోలు 22వ వార్డులో వరుణ్ సాయి ప్రచారం

నిడదవోలు: వైఎస్సార్ సీపీ నిడదవోలు, కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతుగా వారి పిల్లలు విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. నిడదవోలు అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడికి మద్దుతుగా ఆయన కుమారుడు వరుణ్ సాయి మంగళవారం పట్టణంలోని 22వ వార్డు వైఎస్సార్ కాలనీలో పార్టీ శ్రేణులతో కలసి ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ వార్డు ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. తన తండ్రిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు తరపున ఆయన కుమార్తె షాలిని తాళ్లపూడిలో ప్రచారం చేశారు. ఆమె ఆ పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. నమూనా బ్యాలెట్ పత్రాలను అందజేసి తన తండ్రి వెంకట్రావును, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌లను గెలిపించాలని కోరారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖతో పాటు పలువురు నాయకులు ఆమె వెంట ప్రచారంలో పాల్గొన్నారు.



తాళ్లపూడిలో తలారి వెంకట్రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న కుమార్తె షాలిని తదతరులు